19 నుంచి ఎంబీఏ ఇంటర్నల్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ ఇంటర్నల్ పరీక్షలు ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించాలని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ ప్రొఫెసర్ జహంగీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ మూడో ఇంటర్నల్ పరీక్షలను 24వ తేదీలోగా, రోజుకు రెండు కు మించకుండా నిర్వహించాలని కళాశాలల నిర్వాహకులకు సూచించారు. ఇంటర్నల్ పరీక్షలకు నూతన విధానాన్ని రూపొందించినట్లు చెప్పా రు. కళాశాలల యాజమాన్యాలకు ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) తదితర కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్మెంట్ పరీక్ష ఫీజును ఈ నెల 26వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుంతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వేధిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై ఫిలింనగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే అస్సాంకు చెందిన వివాహిత బాబునాయుడు నగర్ బస్తీలో ఉంటూ ఓ కార్పొరేట్ దవాఖానలో హౌస్ కీపింగ్ పనిచేస్తోంది. అందరితోపాటు వికాస్‌తో మాట్లాడేది. అతడు ఆమె ఫొటోలు తీసుకుని మార్పింగ్ చేయడం ప్రారంభించాడు. సన్నిహితంగా ఉండకపోతే ఫొటోలు నీ భర్తకు పంపిస్తానని, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని వేధించడం ప్రారంభించాడు. అతడి వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వంద శాతం డిజిటలైజేషన్

- గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ రాజకుమారి
- ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వర్క్‌షాప్‌లో భాగంగా గాంధీని సందర్శించిన జాతీయ వైద్య బృందం

గాంధీ దవాఖానను సందర్శించిన జాతీయ వైద్యుల బృందంతో సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

బన్సీలాల్ పేట్, మే 16: రోగుల ఆరోగ, రిపోర్టుల వివరాలను వంద శాతం డిజిటల్ చేసేందుకు ఇప్పటికే పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నామని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ రాజకుమారి, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వర్క్‌షాప్‌లో భాగంగా 18 రాష్ట్రాల నోడల్ అధికారుల బృందం శుక్రవారం గాంధీ దవాఖానను సందర్శించింది. గాంధీ హాస్పటల్‌లో సౌకర్యాలు, రికార్డుల డిజిటలైజేషన్ నిర్వహణ, వేగవంతమైన ఓపీ సేవలు, స్కాన్ అండ్ షేర్ విధానం, ల్యాబ్‌లో డిజిటల్ సేవలు అందించే విషయాలపై గాంధీ నోడల్ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వారికి వివరించారు. క్రాస్-లెర్నింగ్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన వైద్యులకు గాంధీలో రోగులకు అందిస్తున్న సేవలను వివరించారు. రోగుల హెల్త్ రికార్డులు డిజిటల్ చేయడం ద్వారా వారి ఆరోగ్య వివరాలు వారి మొబైల్ నంబర్ ద్వారా వారి ఖాతాలో ఉంటాయన్నారు. దీని ద్వారా వివరాలు, ల్యాబ్ రిపోర్టులు జీవితాంతం అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి మెడికల్ బృంద సభ్యులు డాక్టర్ పంకజ్ అరోరా, సౌరభ్‌సింగ్, రితిక, బబిత, అభ్యుదయ్, గాంధీ దవాఖాన ఆర్ఎంఓలు డాక్టర్ రజని, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ నజీమ్, డాక్టర్ సుధీర్, డాక్టర్ యోగి, డాక్టర్ నవీన్, డాక్టర్ సరిత, రాష్ట్ర బృందం దివ్య, డాక్టర్ విమల, సురేష్ పాల్గొన్నారు.

కళాకారులకు వయసు అడ్డు కాదు

గాయకుడు రామకృష్ణను సత్కరిస్తున్న డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి తదితరులు

ముషీరాబాద్, మే 16: నిజమైన ప్రతిభా సంపత్తి ఉంటే వయసు కళాకారులకు అడ్డంకి కాదని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాలాచారి అన్నారు. త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై సాంస్కృతిక సంస్థ గంటిస్ నిర్వాహణలో ప్రముఖ గాయకుడు వైఎస్ రామకృష్ణ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందన సభ జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని రామకృష్ణ, లలిత దంపతులను సత్కరించారు. బీసీ కమిషన్ పూర్వపు చైర్మన్ డాక్టర్ వకుళా భరణం కృష్ణ మోహన్‌రావు మాట్లాడుతూ నాలుగున్న దశాబ్దాలుగా వివిధ వేదికలపై గానం చేస్తూ విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చి తెలుగువారిని ఆకట్టుకున్న రామకృష్ణ విఖ్యాత గాయకులు ఘంటసాల, బాలు, బాల మురళి గలాలను అనుకరించే ప్రతిభావంతుడు అని అభినిందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాల్ రావు, కాంగ్రెస్ నాయకుడు నిరంజన్, వ్యాపారవేత్త అగర్వాల్, వంశీ రామరాజు, కిన్నెర రఘురాం, ఓంకార్ రాజు దైవజ్ఞ శర్మ, సంస్థ అధ్యక్షులు గంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ తోబుట్టువుల నిరసన

బాపూనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద కోర్టు ఉత్తర్వును చూపుతున్న శశిరేఖ, కీర్తి

అమీర్‌పేట్, మే 18: పుట్టింటి ఆస్తిలో తమకు రావాల్సిన వాటాపై కోర్టు ఉత్తర్వులున్నటికీ, తమను ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారంటూ ఇద్దరు మహిళలు ఎస్ఆర్‌నగర్‌లోని బాపూనగర్ కమ్యూనిటీ హాల్ గాంధీ విగ్రహం దగ్గర నిరసనకు దిగారు. విలేకరుల సమావేశంలో వారు వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బాపూనగర్ బస్తీకి చెందిన ఎ.చంద్రు, పార్వతీబాయి దంపతులకు ముగ్గురు సంతానం. ఈ దంపతులు 2011లో మృతి చెందారు. కాగా వీరికి బాపూనగర్ బస్తీలో 90 గజాల స్థలంలో అయిదంతస్తులతో కూడిన ఓ నిర్మాణం ఉంది. కుమార్తెలు ఎం.శశిరేఖ (33), ఎం.కీర్తిరాథోడ్ (35)లకు సోదరుడు మహేష్‌బాబు మధ్య గొడవలు తలెత్తాయి. ఆస్తిలో తోబుట్టువులకు వాటా ఇచ్చేది లేదంటూ మహేష్‌బాబు స్పష్టం చేయడంతో, 2013లో కుమార్తెలిద్దరూ కోర్టును ఆశ్రయించారు. తండ్రి ఆస్తిలో ముగ్గురికి సమాన వాటాను నిర్దేశిస్తూ 2022లో కోర్టు ఫైనల్ డిక్రీ వెలువరించింది. తీర్పు వెలువడిన తరువాత కూడా తమ సోదరుడు తమను ఇంట్లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటాన్నాడని వాపోయారు. ఇదే విషయంలో గతంలో తమపై బస్తీలోని ఇంటి వద్ద భౌతికంగా దాడులు కూడా జరిగాయని తెలిపారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో తమకు న్యాయం జరిగేలా చూడాలని బస్తీ పెద్దలతో పాటు పోలీసులు కోరుతున్నట్టు తెలిపారు. ఈ విషయంలో త్వరలోనే ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలుస్తామని వారు తెలిపారు.

విక్రమరావు మరణం జర్నలిస్టు ఉద్యమానికి లోటు

ముషీరాబాద్, మే 16: జాతీయ జర్నలిస్టు ఉద్యమ నేత, సీనియర్ పాత్రికేయుడు కోటంరాజు విక్రమరావు అకాల మరణం జర్నలిస్టుల ఉద్యమానికి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. సామాజిక స్పృహ, ప్రజాస్వామ్య నైతిక విలువలతో 50 ఏండ్లు జర్నలిస్టుగా పని చేసి జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేసిన విక్రమ్ జీవితం పాత్రికేయులకు ఆదర్శమన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభలో కె.విక్రమరావు సంతాపసభ జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ తిరుమలగిరి సురేందర్, ఐఎఫ్‌డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, సీనియర్ పాత్రికేయుడు గౌరీశంకర్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, బండి విజయ్‌కుమార్, గుడిగె రఘు, కార్యదర్శి చంద్రశేఖర్, తన్నీరు శ్రీనివాస్ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాత్రికేయ సమాజానికి సేవలందించిన మహోన్నతమైన వ్యక్తి విక్రమ్ రావు అని కొనియాడారు. ఢిల్లీలో ఏర్పడిన ఐఎఫ్‌డబ్ల్యూజే వ్యవస్థాపకుల్లో విక్రమ్‌రావు కీలకపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు, జర్నలిస్టు సంఘాల నాయకులు కె.పాండురంగారావు, పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

విక్రమరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

వాటర్‌వర్క్స్‌జీఎంతో కార్పొరేటర్ సమావేశం

జీఎం వినోద్‌తో సమావేశమైన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, మే 16: వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్‌తో సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ సమావేశమయ్యారు. శ్రీనివాస్‌నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో జీఎం వినోద్‌తో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎండాకాలంలో పవర్ బోర్స్‌ను కొన్ని చోట్ల రిపేర్ చేయలేదని, వాటికి వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. అలాగే మ్యాన్ హోల్స్ నిర్వహణ సరిగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాను న్నది వర్షాకాలం సందర్భంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తుగా నాలా పూడికతీత చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు నవ్య, ప్రియాంక పాల్గొన్నారు.

సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలి

సీ క్లాస్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, మే 16: కలుషిత జలాల సరఫరా నివారణకు సత్వరమే చర్యలు చేపట్టాలని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. డివిజన్‌లోని సీ-క్లాస్ ప్రాంతంలో కొన్ని రోజులుగా తాగునీటి సరఫరాలో కలుషిత జలాలు వస్తున్నాయని, తరచుగా డ్రైనేజీ మ్యాన్ హోల్ నిండి మురుగు ఇండ్లలోకి వస్తున్నదని బస్తీవాసులు ఫిర్యాదు చేశారు. దాంతో శుక్రవారం ఆమె జలమండలి హుస్సేన్‌సాగర్ పంప్‌హౌస్ సెక్షన్ మేనేజర్ మనోహర్‌తో కలిసి సమస్య నెలకొన్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె అధికారులను కోరారు. బీఆర్ఎస్ నాయకులు లక్ష్మిపతి, విజయ్‌పాల్, జ్ఞాని, నర్సింగ్‌రావు, అన్వర్ పాల్గొన్నారు.

నేడు వైష్ణోదేవి విశాల్ జాగరణ్

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జాగరణ్ మండల ప్రతినిధులు

బొల్లారం, మే 16: మా వైష్ణో దేవి జాగరణ్ మండల్ ఆధ్వర్యంలో మా భగవతి 21వ జాగరణ శనివారం నిర్వహిస్తున్నట్లు మండల ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శి బీఎన్ శ్రీనివాస్, సురేందర్‌జోషి, కైలాస్‌అగర్వాల్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10వేల మందికి పైగా భక్తులు హాజరవుతారని వెల్లడించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. అమ్మవారికి అఖండ దీపారాధనతో జాగరణ్ సాయంత్రం ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇందులో ప్రముఖ భక్తి గాయకులు లక్బీర్‌సింగ్, రాజా మురారి దహీమ, రాజు బాబ్రా, ప్రతి దాహిమా, స్వాతి దాహిల్ భక్తి గీతాలు భజనలు ఆలపిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో మండల్ ప్రతినిధులు ఆశిష్‌అగర్వాల్, వినోద్, సంజయ్‌అగర్వాల్, సందీప్‌సింగ్, సంతోష్‌జోషి, రాజేందర్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ. 1,000 చొప్పున చెల్లించి ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు వైద్య శిబిరం

కవాడిగూడ, మే 16: ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో రక్తపోటుపై అవగాహనా సదస్సు, వైద్య శిబిరాన్ని నేడు శనివారం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ మనోజ్ కుమార్ తెలిపారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికంగా తలనొప్పి, దృష్టి సమస్యలు, ముక్కు నుంచి రక్తం కారడం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, నీరసం, మూత్రపిండాల పనితీరు క్షీణించడం వంటి లక్షణాలతో రక్తపోటు ఉన్న వ్యక్తి బాధపడతారని తెలిపారు. ఆయా లక్షణాలు ఉన్న వారు సకాలంలో వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందితే రక్తపోటు తగ్గించవచ్చునన్నారు. యూపీహెచ్‌సీలో నిర్వహించే అవగాహనా సదస్సును, వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పార్టీ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే పద్మారావు


రైల్వే దవాఖానలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్‌ను పరామర్శిస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మే 16: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఆయనను సికింద్రాబాద్‌లోని రైల్వే హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దవాఖానకు వెళ్లి చంద్రశేఖర్‌ను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్, మే 16: వివిధ సంక్షేమ పథకాల చెక్కులను నేడు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు సీతాఫల్‌మండి చౌరస్తాలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి, చెక్కుల పంపిణీ చేస్తారి పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

డెంగ్యూ అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్

ఉస్మానియా యూనివర్సిటీ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమలను అరికట్టవచ్చని చెప్పారు. నేషనల్ డెంగ్యూ డే సందర్భంగా తార్నాక లోని పలు కాలనీల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించి, పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ హాజరై మాట్లాడారు. డెంగ్యూ వంటి వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యలు ఎంతో ముఖ్యమని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల ఉత్పత్తిని నియంత్రించడంలో ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతను నెరవేర్చాలని కోరారు. ప్రజల్లో పారిశుధ్యంపై మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఇంటిలో పరిశుభ్రత పాటించడం, నిల్వ నీటిని తొలగించడం, నీటి ట్యాంకులను మూసి ఉంచడం, వాడిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సక్రమంగా తొలగించడం వంటి చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాలు, విద్యాసంస్థలు, పౌరుల మధ్య సమన్వయం ఉంటేనే డెంగ్యూ వంటి వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమన్నారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు దుర్గాప్రసాద్, రాజశేఖర్, ప్రదీప్, నర్సింగ్, జుబేర్, జాఫర్, ఫరూక్, మహమ్మద్, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

చిక్కడపల్లి, మే 16: యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ రాజునాయక్ వివరాల ప్రకారం ఛత్రినాకకు చెందిన శివరామకృష్ణ(28) డీజేలో పనిచేస్తాడు. గురువారం నాగమయ్య కుంటలో ఉండే బావ మహేష్ ఇంటికి వచ్చాడు. అదేరోజు రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివరామకృష్ణ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బావ పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చి డోర్ తెరిచి చూడగా నిర్జీవంగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమ పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు

కవాడిగూడ, మే 16: తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో వాహనాల అక్రమ పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామానుజలరెడ్డి హెచ్చరించారు. డీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఎన్టీఆర్ స్టేడియంలో అక్రమంఆ పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించారు. క్రేన్ సహాయంతో ఒక్కో వాహనాన్ని అక్కడి నుంచి తరలించారు. అనంతరం ముషీరాబాద్ సర్కిల్ 15 డిప్యూటీ కమిషనర్ రామానుజలరెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంలో వాహనాల అక్రమ పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని చెప్పారు. ఇక ముందు వాహనాలను నిలిపితే వాటిని సీజ్ చేసి వేలంపాట వేస్తామని తెలిపారు. స్టేడియంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన స్టేడియంలో చెత్తా చెదారం వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేడియంలో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు అన్ని సదుపాయాలు

అభిషేక్ కుమార్ సన్మానిస్తున్న చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

చిక్కడపల్లి, మే 16: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం నగర గ్రంథాలయంతో పాటు శాఖ గ్రంథాలయాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థలోని శాఖ గ్రంథాలయ గన్‌ఫౌండ్రీలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన అభిషేక్ కుమారును శుక్రవారం చిక్కడపల్లిలోని నవర్ గీత బృందాలయంలో కార్యదర్శి పొట్లూరి పద్మజతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథాపాలకుడు సూర్యప్రకాష్, మహేందర్, వెంకటేష్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, మహేష్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

బన్సీలాల్ పేట్, మే 16: జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్, కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని ఎవర్ గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, పేదల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ వైద్యులు 175 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఆరోగ్య సలహాలను, మందులను అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ప్రముఖ ఫిజియోథెరిపిస్ట్ ఎం.శ్రీనివాస్ ఒంటినొప్పులు ఉన్నవారికి ఎక్సర్ సైజ్‌లను చూపించారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, నర్సింగ్‌రావు, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నాగశేఖర్‌గుప్తా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, సతీష్‌కుమార్, బాలభారతి, సుజాత శివరామకృష్ణ, ఎవర్ గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటేష్, ఎల్లేశ్వర్, జానకిరాం, నాయకులు టి.రాజశేఖర్‌రెడ్డి, శివలింగం, మహేష్, కిషన్, హరినాథ్, నాగరాజు, కిషన్ పాల్గొన్నారు.